క్లుప్తంగా

కాసు మహేష్‌రెడ్డిని కలిసిన పూర్ణ



పిడుగురాళ్ల: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జాయింట్ సెక్రటరీగా శెట్టుపల్లి పూర్ణ నియమితులయిన సందర్భంగా గురజాల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి శెట్టుపల్లి పూర్ణను సన్మానించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా శెట్టుపల్లి పూర్ణ మాట్లాడుతూ తనకు పదవి రావటం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి రుణపడి ఉంటానని, అదేవిధంగా గురజల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

స్వాములు సద్దిని సద్వినియోగం చేసుకోండి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల



గురజాల: పలు మాలలు ధరించిన స్వాములు సద్ది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల పరిశీలకుడు యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని వేంచేసియున్న పల్నాటి యాదాద్రి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో అక్టోబర్ 8వ తేదీ నుంచి నవంబర్ 18వ తేదీ వరకు మాల ధరించిన స్వాములకు సద్ది ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ముందుగా పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

శివాలయంలో చోరీ



రెంటచింతల: రెంటచింతలలోని శివాలయంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి కానుకల హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు ఈవో గాదె రామిరెడ్డి తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో చోరీ ఘటన రికార్డు అయినట్లు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

బుల్లెట్ వాహనం చోరీ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని రామాలయం సెంటర్లో బుధవారం తెల్లవారుజామున బుల్లెట్ వాహనం చోరీకి గురైంది. మనిగండ్ల మల్లిఖార్జునరావు వాహనాన్ని ఇంటి ముందు ఎప్పటిలా పార్క్ చేయగా చోరీకి గురికావడం జరిగింది. ఆ ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో చోరీ దృశ్యాలు రికార్డు అయినట్లు గుర్తించారు. వాహనం చోరీకి గురైనట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి శ్రామికులకు ఈ-కేవైసీ తప్పనిసరి



దుర్గి: ఉపాధి శ్రామికులందరికీ ఈ-కేవైసీ తప్పనిసరి అని మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఉన్న 21,047 మందికి గాను 6,094 మంది ఈ-కేవైసీ చేయించుకున్నారని ఏపీవో మల్లిఖార్జున తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి శ్రామికులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని, లేనిపక్షంలో వారు అర్హత కోల్పోయే ప్రమాదముందన్నారు. మేట్లు క్షేత్ర స్థాయిలో గ్రామంలో ఉన్న జాబు కార్డు కలిగిన ఉపాధి శ్రామికులందరికీ తప్పనిసరిగా ఈ-కేవైసీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

అడవులను కాపాడదాం.. వన్యప్రాణులను రక్షిద్దాం

ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సుజాత



వెల్దుర్తి: అడవులను కాపాడదాం.. వన్యప్రాణులను రక్షిద్దామని విజయపురిసౌత్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ టి.సుజాత అన్నారు. బుధవారం మండలంలోని మిట్టమీదిపల్లె గ్రామంలో ఉన్న సరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. వన్యప్రాణుల వారోత్సవాలలో భాగంగా సరస్వతీ విద్యానికేతన్‌లో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు. అడవులను కాపాడటం వలన పర్యావరణ పరిరక్షణ జరిగి స్వచ్ఛమైన గాలి అంది మానవుల ఆయుష్షు పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ మహేష్‌బాబు, బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





నడికుడి పాలు మినిస్ట్రీస్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కాస్త పట్టించుకోరూ...

నగర పంచాయతీలో పారిశుద్ధ్యం పడకేసింది. నివాస గృహాల మధ్య మురుగునీరు నిల్వ ఉంటుంది. నిల్వ ఉన్న మురిగునీటిలో పాచి పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. నడికుడి రోడ్డులో పాలు మినిస్ట్రీస్ చర్చి వద్ద రోడ్డుపై ఇరువైపులా మురుగు నీరు భారీగా నివాస గృహాల వద్ద పేరుకుపోయింది. నిల్వ ఉన్న మురుగునీటిలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమ కాటు వలన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని సమీప గృహాల ప్రజలు భయపడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నప్పటికీ మురుగు నీరు పారేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఈ మురుగు నీటిలో ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. తక్షణమే మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

–దాచేపల్లి

డాక్టర్ ప్రభుదాసుకు సాహితీ భూషణ్ అవార్డు

రెంటచింతల: స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన రెవ.డాక్టర్ డాకూరి ప్రభుదాసుకు విశ్వకవి డాక్టర్ గుర్రం జాషువా జయంతి, గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 37వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాదు రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో సాహితీ భూషణ్ అవార్డు, మెడల్, సర్టిఫికెట్‌ను సోమవారం అందజేశారు. 32 సంవత్సరాల పాటు జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ ఫౌండర్, ప్రెసిడెంట్‌గా రెండు తెలుగు రాష్ట్రాలలో దేవుని సేవ (సువార్తను బోధిస్తూ)చేస్తూ క్రైస్తవ రచయితగా పేరు పొందిన రెవ.డాక్టర్ ప్రభుదాసును గుర్తించి ఈ అవార్డును ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, అంతర్జాతీయ సాహితీవేత్త, సంస్థ చైర్మన్ డాక్టర్ పెద్దిటి యోహాను, ప్రముఖ కవి, కవిత్వ విశ్లేషకులు డాక్టర్ విద్యాధర్(ఐఆర్ఎస్) చేతుల మీదుగా ప్రదానం చేయడం జరిగింది. బుధవారం అవార్డు గ్రహీత ప్రభుదాసును రెవ.డాక్టర్ కె.సువర్ణరాజు, రెవ.డాకూరి రాజ్‌కుమార్, రెవ.వి.సుందరరావు, రెవ.డాక్టర్ మోజేష్ తదితరులు అభినందించారు.



సాహితీ భూషణ్ అవార్డు అందుకుంటున్న రెవ.డాక్టర్ ప్రభుదాసు

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్యను అమలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ ఇంగ్లీష్ మీడియం విద్య పరిరక్షణ వేదిక సమన్వయకర్త ఏడుకొండలు

పిడుగురాళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్యను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఇంగ్లీష్ మీడియం విద్య పరిరక్షణ వేదిక సమన్వయకర్త దాదినబోయిన ఏడుకొండలు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల జీవితాన్ని మార్చేసే శక్తి ఇంగ్లీష్ మీడియం విద్యకే ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మకంగా ఇంగ్లీష్ మీడియంను తీసుకొని వచ్చారన్నారు. అమ్మ భాష తెలుగు అయితే నడిపించే నాన్న భాష ఇంగ్లీష్ అని, జీవితంలో ఎదగాలంటే ఇంగ్లీష్ చదవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ చిట్టిబోయిన నరసింహారావు, మందా వెంకట్రావు, కానాల శ్రీనివాసరెడ్డి, జక్కుల కొండలు, షేక్ హాసన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎస్‌కే యాసిన్ తదితరులు ఉన్నారు.

అధిక వర్షాలకు పత్తి, మిరప పంటలకు నష్టం వాటిల్లుతుంది

ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల: అధిక వర్షాల వలన పత్తి, మిరప పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. బుధవారం ఆయన పత్తి పంటలను పరిశీలించి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి రైతులకు సలహాలు అందిస్తారని అన్నారు. ముంపు నివారణకు తాత్కాలిక కాలువల ద్వారా, పంపుల సహాయంతో నీటిని త్వరగా తొలగించాలని రైతులకు తెలియజేస్తున్నామన్నారు. పోషక యాజమాన్యం కోసం యూరియా 2 శాతం, పొటాషియం నైట్రేట్ 1 శాతం, జింక్, బోరాన్ కలిగిన ద్రావణాలను ఆకులపై పిచికారీ చేయాలన్నారు. పత్తిలో తెగుళ్ల నివారణకు కార్బెండాజిమ్, మాంకోజెబ్ లేదా మెటాలాక్సిన్ వాడాలని, కాపర్ ఆధారిత తెగులు మందులు పిచికారీ చేయాలని సూచించారు. మిరప పంటలో కాపర్ ఆక్సీక్లోరైడ్, ప్లాంటోమైసిన్ పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యం

ఎంఈవో పినాకపాణి

దాచేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. ఎంఈవో పినాకపాణి, ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, విద్యా కమిటీ చైర్మన్ హఫీజ్ ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు చాలా ముఖ్యమని, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయని ఎంఈవో పినాకపాణి చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బెల్లంకొండ బద్రి, సొసైటీ అధ్యక్షుడు తంగెళ్ల శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ పగడాల భాస్కరరావు, నాయకులు శ్రీరాములు, నర్రా పుల్లయ్య, మునగా నిమ్మయ్య, కొప్పుల గిరి, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

అండర్-14, 17 పోటీలకు మంచికల్లు విద్యార్థినులు

రెంటచింతల: మండలంలోని మంచికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు నియోజకవర్గ అండర్-14, 17 పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిలార్ అహమ్మద్ బుధవారం తెలిపారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెంటచింతల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14, 17 ఆటల పోటీలను ప్రారంభించారన్నారు. ఈ పోటీలలో అండర్-17 విభాగంలో నియోజకవర్గ కబడ్డీ జట్టుకు పాఠశాలకు చెందిన పొట్లూరి నాగేశ్వరి, షేక్ సాజిత, ఏలూరి నవీన, అండర్-14 కబడ్డీ జట్టుకు బుడిగి పూజిత ఎంపికైనట్లు వెల్లడించారు. నియోజకవర్గ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు తోట వెంకటేశ్వర్లు, సాయి భాస్కర్, షేక్ అహమ్మద్ జానీ, మాధవరావు, శారద, నాగరాజు అభినందించారు.



అండర్-14, 17 పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

18 నుంచి జనవిజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు

చిలకలూరిపేటటౌన్: జనవిజ్ఞాన వేదిక ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి సంబరాలు ఈ నెల 18వ తేదీ శనివారం పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నట్లు స్థానిక డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.అజయ్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలు(పోస్టర్) పట్టణంలోని రోటరీ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పాఠశాల స్థాయిలో జరిగిన చెకుముకి పోటీల్లో చిలకలూరిపేట నియోజకవర్గంలో 7 వేల మంది పాల్గొన్నారని, ఈ ఏడాది ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు నవంబర్ 1వ తేదీన నిర్వహించే సంబరాల్లో బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రధాన ఉపాధ్యాయులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అజయ్‌బాబు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధూళిపాళ వెంకట్రావు, ప్రచురణల కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు, సాహితీవేత్తలు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, డాక్టర్ పీవీ సుబ్బారావు, డాక్టర్ చుక్క విన్సెంట్‌పాల్ తదితరులున్నారు.



చెకుముకి సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

14న అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూ

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గణితం-1, జువాలజీ-1 అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నయిమ్‌భాను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పోస్టులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, యూజీసీ నెట్ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఇంగ్లీషు మీడియంలో బోధన చేయగలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు aprdc.agarjunasagar@gmail.com వెబ్‌సైట్‌కు రెజ్యూమ్, సర్టిఫికెట్లు పీడీఎఫ్‌లో పంపించాలని కోరారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8688169290 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అర్హత ఉన్నా ఆటో డ్రైవర్లకు అందని పథకం

దుర్గి: కల్లబొల్లి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మాటలను ఇంకా చెబుతూనే ఉంది. అర్హులైన ఆటో డ్రైవర్లకు సీఎం చెప్పిన ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని అర్హులైన వారికి అందించకుండా అడ్డుకోవటం దారుణమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు పులిమెల భాస్కర రావు, మాచర్ల మైఖేల్‌లు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని ముటుకూరు గ్రామంలో దళిత, బీసీల వర్గాలకు చెందిన ఏడుగురు ఆటో డ్రైవర్లకు అర్హత ఉన్నా పథకం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు



రెంటచింతల: మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన మూఢావత్ హనుమంత్ నాయక్ అనే యువకుడు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ నాగార్జున బుధవారం తెలిపారు. ఈ నెల 4న హనుమంత్ నాయక్ రెంటచింతల వెళ్లి వస్తానని తల్లి ద్వాలిబాయికి చెప్పి మంగళవారం సాయంత్రానికి కూడా తిరిగి ఇంటికి రాలేదని పోలీసులకు తెలిపినట్లు వెల్లడించారు. హనుమంత్‌నాయక్‌కు మధుమతిబాయితో 10 సంవత్సరాల కిందట వివాహం కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో వారిద్దరు కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. తల్లి ద్వాలిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయా లైన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కంటిపూడి గ్రామానికి చెందిన కారసాని ప్రమోద్ సత్తెనపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై కంటిపూడి వెళుతుండగా నందిగామ అడ్డరోడ్డు వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో గుంటూరు నుంచి సత్తెనపల్లి వస్తు న్న విద్యుత్ శాఖకు చెందిన బొల్లేరో వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో ప్రమోదుకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నాదెండ్ల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు విక్రయించినా, రవాణా చేసినా, సేవించినా, ప్రేరేపించినా 100 నంబరుకు గానీ, ఉపాధ్యాయులకు గానీ సమాచారమివ్వాలని కోరారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాల వలన కలిగే ఆరోగ్య, మానసిక నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐ.కృష్ణానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు టీముల ఏర్పాటు

తహసీల్దార్ కరుణకుమార్



దుర్గి: మండలంలోని నిదానంపాడు గ్రామంలో భూముల రీసర్వే ప్రక్రియ పూర్తి చేయటానికి రెండు టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జి.కరుణకుమార్ విలేకరులకు తెలిపారు. ఏపీ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా జరిపిన రీసర్వే గ్రామ సభలో అందిన ఫిర్యాదుల మేరకు గురజాల డివిజన్, దుర్గి మండల పరిధిలోని నిదానంపాడు గ్రామాన్ని మూడవ విడత రీ సర్వే చేయటానికి ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. కలెక్టర్ కృతికాశుక్ల ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వీఆర్వోలతో రెండు టీమ్‌లుగా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. 19 మందితో టీమ్ ఏర్పడిందని, కమ్యూనికేషన్ టీమ్‌తో సమన్వయం చేసుకొని క్షేత్ర స్థాయి పనుల్లో నిమగ్నమై సర్వే సరిహద్దుల చట్టం నిబంధనలను పాటించాలన్నారు. రీ సర్వేలో టీమ్ మొత్తం పాల్గొని రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి రోజు వారీ రిపోర్ట్‌ను సంబంధిత ప్రోఫార్మాలో అందజేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై తగు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కాసు పరామర్శ

పిడుగురాళ్లరూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి బుధవారం పరామర్శించారు. దీనిలో భాగంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అరమళ్లి కవిత కుటుంబ సభ్యులను, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి భార్య అనారోగ్యంతో ఉండటంతో ఆమెను పరామర్శించారు. ఎస్సీ నాయకులు భూషి కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా బ్రాహ్మణపల్లి సర్పంచ్ షేక్ ఖాశింబి భర్త బడేసాహెబ్ అనారోగ్యంతో ఉండటంతో ఆయనను పరామర్శించారు. ఇటీవల యర్రంరెడ్డి సూరారెడ్డి మరణించగా వారి కుటుంబ సభ్యులను, షేక్ నాగుల్ మీరా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి భరోసా ఇచ్చారు.



కవిత చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

నోడల్ ఆఫీసర్ చాణక్య

గురజాల: కేంద్ర ప్రభుత్వం వస్తువులపై తగ్గించిన జీఎస్టీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ నోడల్ ఆఫీసర్ చాణక్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నవోదయ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం ఏదైనా వస్తువులను కొనుగోలు చేస్తున్నప్పుడు విధిగా జీఎస్టీ తగ్గిందా లేదా పాత జీఎస్టీతోనే మన వద్ద వసూలు చేస్తున్నారా అని గమనించాలి. జీఎస్టీ తగ్గింపు వలన కొనుగోలుదారులకు కొంత మేరకు ఊరట కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపుపై డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వైవీఎల్ శివన్నారాయణ, ఎంఈవో ఆకుల సత్యనారాయణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన వర్షపు నీరు.. రాకపోకలకు ఇబ్బందులు



తంగెడ-మఠంపల్లి కృష్ణానది వారధిపై నిలిచిన వర్షపు నీరు

దాచేపల్లి: కృష్ణానది వారధిపై వర్షపు నీరు చెరువుని తలపిస్తుంది. వారధి కింద కృష్ణానది ప్రవహిస్తుండగా పైన కూడా నీళ్లు ప్రవహిస్తున్నట్లుగానే కనిపిస్తుంది. దాచేపల్లి మండలం తంగెడ గ్రామం నుంచి తెలంగాణలోకి వెళ్లేందుకు కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జి మీద వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జిపై నీరు నిల్వ ఉంది. వాహనాల వెంట వచ్చే దుమ్ము ధూళి కూడా బ్రిడ్జిపై పేరుకుపోయింది. దీంతో వారధిపై బురద నీరు ఎక్కువగా నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులైతే కిందపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఈ బురద నీటిని తొలగించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

పదో తరగతిలో సత్తాచాటాలి

నాదెండ్ల: ఓ వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం విద్యేనని విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించటం, 11 మంది ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించటం పాఠశాలకు గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు పేరు వచ్చిందన్నారు. ఈ ఏడాది కూడా నూరు శాతం ఫలితాలతో సత్తా చాటాలన్నారు. పదో తరగతిలో కష్టపడిన విద్యార్థులకు పై చదువులు సులభంగా ఉంటాయన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. దేశ భవిష్యత్తుకు బలమైన పునాది విద్యార్థులేనన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రామిరెడ్డి

వేర్వేరు చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

నరసరావుపేట టౌన్: రెండు వేర్వేరు చోరీ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ ఎం.వి.చరణ్ తెలిపారు. బుధవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. రామిరెడ్డిపేటకు చెందిన దాసరి ప్రణీత గృహంలో అమరావరపు భూలక్ష్మి పనిమనిషిగా పనిచేస్తూ ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో భూలక్ష్మి పని చేసే గృహంలో బంగారు ఆభరణాలు దొంగిలించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామన్నారు. లభ్యమైన సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి చోరీ సొత్తు నక్లెస్, చైన్, లాకెట్, జత గాజులు, జత చెవిదిద్దులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని జేబు దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడు షేక్ బాజీను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వంశీకృష్ణ, సిబ్బంది వీరాంజనేయులు, మురళి పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరణ్, ఎస్సై వంశీకృష్ణ